'అలాగ నువ్వు సంతృప్తిచెందితే నాకింకేం కావాలి?'

అన్నపూర్ణ చేతులు ఆతన్ని గట్టిగా చుట్టుకున్నాయి. కొంతసేపటికి అలసట, ఆనందంతో కలిగిన సంపూర్ణ విశ్రాంతితో ఆమెకి గాఢంగా నిద్రపట్టింది. అతను కూడా నిశ్చలంగా పడుకునే ఉన్నాడు. నిద్రమాత్రం లేదు భయంతో కొట్టుకుంటూవున్న గుండెలతో, ఆందోళనతో ఊపిరి బిగబట్టి ప్రార్థిస్తున్నాడు.

'చాప చప్పుడు కాకుండా తీసి, ఓరగా తలుపువేసి, క్రిందికి వెళ్ళగలదా సావిత్రి? అది సాధ్యంకావాలి! అన్నపూర్ణకి వ్యథ కలుగకుండా ఉండాలి!'

సావిత్రిదీ అదే ఆందోళన; అదే ప్రార్థన.

# ★ క్షణంతోపగం ★

"శారద"

ప్రశ్నార్థకం, ఆశ్చర్యార్థకం పోట్లాడుకుని ఫుల్‌స్టాప్ అయిపోయాయి. కావ్యనిర్మాణంలో కవి కర్తని మర్చిపోయినాడు. చెప్పిన పని చేసేవాడికన్నా, చెయ్యకుండా చెప్పేవాడే అనాథ మానవులకి అధినేతా, నోరులేని పత్రికలకి ఎడిటరూ అవుతున్నాడు. వికాసం హఠాత్తుగా ప్రశ్నిస్తాడు: 'పెద్దముల్లూ చిన్నముల్లూ రోజులో ఎన్నిసార్లు కలుసుకుంటాయి?' అని. దరిద్రుడు. దేశంలో ఇంకేం ప్రశ్నలు లేనట్టే! ఉద్యోగం దొరికినవాడు దొరకనివాడిని చూసి ఈర్ష్య పడటానికి కారణం ఏమిటో చెప్పటం సాధ్యం కాకుండావుంది. జీతాల పెంపకంలో హెచ్చుతగ్గుల విషయమై వేసిన కమిటీ లంచాల విషయం తేల్చటం సముచితంగావుంది. వాడొక నాన్‌గెజెటెడ్ ఆఫీసరు. వాళ్ళ ఉన్నబ్బాయి ఆఫీసర్‌గారి హోదాకి భంగంరాని విధంగా గౌరవప్రదంగా వురెట్టుకుని చచ్చాడు.

పక్కింటాయన అర్థరాత్రి రేడియో పెట్టుకుని నా నిద్రకి జోలపాడుతూంటే వాణ్ణీ వాడి రేడియోనీ ఇంట్లో ఎవరూ లేకుండా చూసి పాతేశాను. మన తత్వసిద్ధాంతి వచ్చి, వాణ్ణీ వాడి రేడియోనీ బతికించాడు. నేనూ నా దీపం ఇల్లు మార్చుకున్నాం. ఈ ఇంటికి కప్పు లేదు. గోడలూ లేవు. హాయిగావుంది ప్రాణానికి. సరిహద్దులులేని దేశానికి యుద్ధాలుండవ్. వాళ్ళబ్బాయికి బారసాలచేసి పేరుపెట్టారు. పేరెందుకన్నాడు అభ్యుదయకామి. వాళ్ళపిల్లకి అన్నీ రాజకీయ నామాలే పెట్టాడాయన. విప్లవం; దేశభక్తుడు; త్యాగం...ఇట్లా.ఏం బావుందలా?

ఇకముందు పుట్టబొయ్యే అమ్మాయిలకి కొన్ని పేర్లు సూచించాడు కూడాను. అశోకచక్రం; రాష్ట్రభాషావర్ధని; అధికోత్పత్తి సంజీవి. వనమహోత్సవి, అని ఇంకా చాలా చెప్పేడు గాని జ్ఞాపకం రావటం లేదు. విలాసరావు 'కొత్త యుగానికి కొత్తపేర్లు' అని ఒక సుప్రసిద్ధ దినపత్రిక, ఆదివారపు సాహిత్యానుబంధంలో వ్యాసం వ్రాశాడు.

'మీ అమ్మాయిల్ని మీ జీవిత సాన్నిహిత్యంలోకి తెచ్చే పేర్లతో పిలిచి ముందడుగు వెయ్యండి. ప్రతీదానికీ 'పర్పస్' ఉండాలని రాజకీయ, సాహిత్యవేత్తలు గొంతుకలు తడిలేకుండా అరుస్తున్నారు. వాళ్ళని కనికరించి మీ అమ్మాయిల పేర్లని సార్థకం చెయ్యండి. ఇదిగో ఉదాహరణ: సంఘోద్ధారిణి; విడాకులు; ముందడుగు, ఖద్దరునూలు; సుఖజీవితం; ఫుడ్ రేషన్; కుషన్ కుర్చీ; నిర్మాణ కార్యక్రమి; విద్యావయోజని; బహుభార్యా నిషేధని; లాంటివి. ఆపైన మీరూ ఆలోచించి మంచి పేర్లు పెట్టుకోవచ్చు.'

విలాసరావు తెలివికి మెచ్చి స్వతంత్ర భారత ప్రభుత్వం ఏదైనా సబ్సిడీ ఇవ్వచ్చని వ్యాసంకింద ఎడిటర్ ఫుట్‌నోట్ పెట్టాడు. ఈ సూచనని నేను అమల్లో పెట్టేశాను. నా పుట్టగల మొదటి అమ్మాయిపేరు దరిద్రవర్ధని అనో, దరిద్ర నిరోధిని అనో పెట్టగలను. కాని నా భార్యమాత్రం మా అత్తగారి నామం సార్థకం చెయ్యాలని మొండికేస్తోంది. దానికి అభ్యుదయం; పర్పస్, లిటరేచర్-లాంటి పదాలు అర్థమై చావటం లేదు.

కమ్యూనల్ జి. ఓ.' అని బతికున్న మాపిల్లాడికి మొన్న పేరెట్టి ఇవ్వాళ మళ్ళీ మార్చేసి 'సుప్రీం తీర్పు' అని పేరెట్టాను. మా ఆవిడ మాత్రం వాణ్ణి ఎప్పటిలాగే బుజ్జీ బుజ్జీ అని పిలుస్తోంది.

'మా అరిణ్ణి ఏదో ఉద్యోగంలో పెట్టాలి. లేకపోతే దేశానికి తీరని ద్రోహం చేసినవాణ్ణవుతాను' అన్నాడు వేదాంతరావు. ఆయన ఇంకా తన ఉపన్యాసంలో ఉపోద్ఘాతం పూర్తిగాక ముందే ప్రత్తిగింజలు వాడటంలో నూతన పద్ధతులూ, ఇంకా అనేక విషయాలు జల్లించి వెలిబుచ్చారు. వారి ఉపన్యాసం సుదీర్ఘంగా వుండగలదని అనధికార వర్గాలద్వారా సేకరించి విశ్వసనీయమైన జాతీయ వార్తా సంస్థచేసిన ప్రకటననిబట్టి తెలుస్తోంది.

శివోహం! ఇదేమిటి! నే నిక్కడున్నానేమిటి! ఇదేదో సముద్రం. ఘోష పెడ్తోంది గనక సముద్రం అనుకున్నాను. ఇది ఒకరకం అఘాతంట. తొంగి చూశాను. నగల కొట్టు. చుట్టూ నారీమణుల వేట. పొరపాటు. ఇక్కడ మనకేం పని? వెళదాం. ఎలా వెళ్ళటం! ఒక వనితామణిని అర్థించాను. ఇదేమిట్ అని ఆమె ముక్తసరిగా 'యూటం అబద్ధాల సంఘం' అని గొణిగి వూరుకుంది.

అంటే ఏమిటో వివరించమని ప్రార్థించాను. ఆమె చెప్పిన కథ ఇది: 'ఒక పిల్లిని ఈ వూళ్లో వాళ్ళందరూ దొమ్మిగా కాల్చి, ఉరేసి చంపాలని చూశారు. కాని అది చావలేదు. చివరకు అంతా కలిసి దాని తల నరికి నిలువుగోతున పాతేశారు. తెల్లారేసరికి ఆ పిల్లి తన తలని నోట కరుచుకుని పారిపోయింది!' వహ్వా! బావుందలేదూ! ఈ కథ విన్నాకనే అశియా ఖండంలో శాంతి నెలకొల్పడానికి ట్రూమన్ ప్రయత్నిస్తున్నాడు.

అంతర్జాతీయ సంగీత సంఘానికి రాజకీయ నేతల్ని ఎన్నుకున్న బుద్ధికుంతుల్ని ఆంధ్రదేశం ఆహ్వానిస్తుందని మీకు తెలుసా! వాళ్ళకి ఎనిమిదో స్వరం, హరతాళం, శ్రుణ్ణంగా వొచ్చని కొరియా సమస్యలో తేలిపోయిందని ఓ న్యూయార్కు సంగీత పత్రిక వివరణ ఇచ్చిందని నమ్మకంగా తెలీటంలేదు.


# ఆంధ్ర బ్యాంక్ లిమిటెడ్

స్థాపితము: 1923

హెడ్డాఫీసు: మచిలీపట్టణము

మదరాసు బ్రాంచి.
బాంబే మ్యూచియల్ బిల్డింగ్
378, ఎస్ప్లనేడ్.
త్యాగరాయ నగర్ ఆఫీసు:
18/28 పాండీ బజారు.
మైలాపూర్ ఆఫీసు:
49, కచేరి రోడ్డు.

ఇతర బ్రాంచీలు, సబ్ ఆఫీసులు

మచిలీపట్టణము, నెల్లూరు, తెనాలి, గుంటూరు, బెజవాడ, ఏలూరు, రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్టణము, విజయనగరము బరంపురం (గంజాం), గూడూరు, ఒంగోలు చీరాల, దుగ్గిరాల, నరసారావుపేట, వినుకొండ, అరండల్‌పేట (గుంటూరు), గవర్నరుపేట (బెజవాడ), గుడివాడ, పాలకొల్లు, భీమవరం, సామర్లకోట, రామారావుపేట, (కాకినాడ,) పిఠాపురం, తుని, అనకాపల్లి, చికాకోల్ (వైజాగ్), జయపూర్ (ఒరిస్సా) పెద్దాపురం, అమలాపురం, ఆముదాలవలస, తిరువూరు, పెడన (కృష్ణా), సాలూరు, చల్లపల్లి, మహారాణిపేట, (విశాఖపట్టణము) జగ్గయ్యపేట (కృష్ణా), గొల్లప్రోలు (తూ. గో.) బాపట్ల (గుంటూరు)

వివరము లే ఆఫీసులోనైనను తెలిసికొనవచ్చును.

తాడేపల్లి శ్రీరాములు
మేనేజింగ్ డైరెక్టర్.

ఇ. రామచంద్రమూర్తి,
ఎమ్. ఏ. సి. ఏ. ఐ. ఐ. బి.,
ఆక్టింగ్ జనరల్ మేనేజరు